TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

**విలేఖరులు కావలెను**

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 234 | ఆదివారం 16-08-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

# భాజపా, బీఆర్ఎస్

## ఒకే నాణేనికి బొమ్మా బొరుసు: సీఎం రేవంత్

### రేషన్ కార్డు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక

- కాంగ్రెస్ హయాంలోనే రైతు రాజయ్యాడు: సీఎం
- 37 నెలల్లో 70 లక్షల మంది రైతులకు రూ.36 వేల కోట్ల రైతుబంధు
- 32 నెలల్లో వడ్ల కొనుగోలుకు రూ.90 వేల కోట్లు చెల్లింపు
- రైతులకు ఉచిత విద్యుత్ కోసం ఏటా రూ.35 వేల కోట్లు
- మహిళలకు ఈసారి చిలకపచ్చ చీరలు పంపిణీ
- నిరుద్యోగులు ప్రలోభాలకు గురికావొద్దు: రేవంత్
- ఆరు నెలలకు ఒకసారి ఉద్యోగ నోటిఫికేషన్లు: సీఎం
- విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్తున్నాం



సంగారెడ్డి: భాజపా, బీఆర్ఎస్ పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసుల్లాంటివని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఏనాడైనా పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన చేశాయా? అని ప్రశ్నించారు. సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

"రేషన్ కార్డు అనేది కేవలం బియ్యం తెచ్చిపెట్టే సాధనం మాత్రమే కాదు.. ఇది ప్రజల ఆత్మగౌరవం. ఎక్కడికి వెళ్లినా ఆకలి తీర్చే కార్డు. రేషన్ అనే వ్యవస్థను ప్రారంభించిందే కాంగ్రెస్ పార్టీ. ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకొని పేదలకు మేం సంక్షేమాన్ని అందిస్తున్నాం. మా పథకాలపై చాలా మంది చాలారకాలుగా మాట్లాడుతున్నారు. భాజపా, బీఆర్ఎస్ పార్టీలను నేను ప్రశ్నిస్తున్నా.. ఏనాడైనా పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన మీకు వచ్చిందా? మీరిచ్చిన దొడ్డు బియ్యం ఏనాడైనా పేదలు వండుకొని తిన్నారా? మేం ఇచ్చిన సన్న బియ్యం బర్రెలకు, కోళ్లకు దాణాగా వాడారా? రేషన్‌లో సన్నబియ్యం ఇవ్వడంతోనే మార్కెట్‌లో బియ్యం రేట్లు తగ్గాయి. కాంగ్రెస్ వస్తే కరెంటు పోతుంది అన్నారు.. ఏనాడైనా పోయిందా?" అని సీఎం ప్రశ్నించారు.

**కాంగ్రెస్ హయాంలోనే రైతు రాజయ్యాడు..**

"వరి వేస్తే... ఉరి వేసుకున్నట్లే అని ఆనాడు కేసీఆర్

వివరాలు 2 లో..

# ఒక గంట సమయం ఇవ్వండి..

## నాకు ఆ ఫేవర్ చేయండి:

### యువతను కోరిన మోదీ



- యువతకు మోదీ పిలుపు.. జనగణనలో చురుగ్గా పాల్గొనండి
- "ఒక గంట, రెండు గంటల సమయం దేశానికి కేటాయించండి"
- కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ
- పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్
- జనగణన వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు
- 'దిమాగీ నక్సల్స్'ను గుర్తించి ఏకాకిని చేయాలని పిలుపు
- తయారీ, వ్యవసాయం, టెక్నాలజీ సహా 'సప్తధార' రోడ్‌మ్యాప్
- పార్లమెంట్, అసెంబ్లీల్లో మహిళలకు 33% రిజర్వేషన్‌కు సహకరించాలి
- స్వాతంత్ర్య వేడుకలకు ఖర్గే, రాహుల్ గాంధీ గైర్హాజరు

ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ యువత లక్ష్యంగా పలు కార్యక్రమాలను ప్రకటించారు. కోటి మంది యువతకు ఏఐ (ఇూ×) నైపుణ్యాలలో శిక్షణ ఇస్తామని, పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే.. ఉచిత కోచింగ్ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యవత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు. "నేను అందరినీ ఒక ఫేవర్ చేయాలని అడుగుతున్నాను. ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ మాత్రం సమయం దేశాన్ని ఎలా బలోపేతం చేస్తుందా..?

పేజి 2లో ▶



## మహిళా సాధికారతకు

# 'స్త్రీ శక్తి' బాట

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- స్త్రీ శక్తి పథకానికి ఏడాది పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా 87 కోట్ల ఉచిత ప్రయాణాలు
- మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించిన సీఎం
- క్యాంప్ కార్యాలయంలో తేనీటి విందు, ముఖాముఖి
- మహిళల్లో పెరిగిన ఆర్థిక స్వాతంత్ర్యం, ఆత్మవిశ్వాసం

2లో

# అర్హులందరికీ

## రేషన్ కార్డులిస్తాం: మంత్రి ఉత్తమ్



- అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తాం: ఉత్తమ్
- రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 16 లక్షల కొత్త రేషన్ కార్డులు
- ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం

సంగారెడ్డి: రాష్ట్రంలో అర్హులందరికీ రేషన్ కార్డులను మంజూరు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. రేషన్ కార్డుల మంజూరు ఓ నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు.

పేజి 2లో ▶

# క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులు

## ప్రారంభించిన పవన్ కళ్యాణ్

- రాజమహేంద్రవరంలో సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకు ప్రారంభం
- వర్చువల్‌గా ఆరు క్లస్టర్ల బ్యాంకుల ఆవిష్కరణ
- 5,000 హస్తకళాకారుల కుటుంబాలకు లబ్ధి
- కళారూపాలపై క్యూఆర్ కోడ్ విధానం పరిశీలన
- కళాకారుల నుంచి బొమ్మలు కొనుగోలు చేసిన డిప్యూటీ సీఎం



రాజమహేంద్రవరం, ఆగస్టు 15 : హస్తకళల పరిరక్షణే లక్ష్యంగా అటవీ శాఖ ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ధవళేశ్వరంలో సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆరు ప్రధాన క్లస్టర్లలో ఏర్పాటైన బ్యాంకులను వర్చువల్‌గా ప్రారంభించారు.

పేజి 2లో

# ఆకట్టుకుంటున్న ప్రభుత్వ ప్రగతి శకటాలు



- విజయవాడ, గుంటూరులో శకటాల ప్రదర్శన
- రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిబింబించేలా ఏర్పాట్లు
- ఈ నెల 17వ తేదీ వరకు సందర్శనకు అవకాశం
- వివరాలు వెల్లడించిన సమాచార శాఖ ఇన్‌చార్జ్ డైరెక్టర్

2లో

# రేవంత్‌వి అసత్యాలు..

## నిరుద్యోగులే గుణపాఠం చెబుతారు: హరీశ్‌రావు

సిద్దిపేట: సంగారెడ్డి సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. సీఎం తన ప్రసంగంలో సంగారెడ్డి జిల్లాలోని సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టు పనుల గురించి మాట్లాడలేదని విమర్శించారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వంలో సంగారెడ్డి జిల్లాకు ఏం చేశారో చెప్పాలన్నారు.



2లో

# ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే లక్ష్యం

### స్పీకర్ అయ్యన్నపాత్రుడు



- అసెంబ్లీ ప్రాంగణంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం
- పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జెండా ఆవిష్కరణ
- అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న స్పీకర్
- విద్యార్థులకు చట్టసభల పనితీరుపై అవగాహన
- రాజధాని అమరావతి అభివృద్ధికి సమష్టి కృషి అవసరం

2లో

# హైకోర్టులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



- సీజే లీసా గిల్
- హైకోర్టు ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరణ
- అమరవీరుల ఆశయాల సాధనకు పిలుపు
- రాజ్యాంగ విలువల పరిరక్షణే లక్ష్యం
- పేదలకు సత్వర న్యాయం అందించడమే ప్రథమ ప్రాధాన్యం
- లోక్ అదాలత్‌ల ద్వారా 13.95 లక్షల కేసులు పరిష్కారం

2లో

TGTEL/25/A0827
ప్రజా దివాన్స్
తెలుగు దినపత్రిక
16-08-2026

# సంపాదకీయం

## పర్యావరణ చట్టానికి తూట్లు

చట్టాలలో ప్రజాప్రయోజన చట్టాలకు ఒక విశిష్ట స్థానం ఉంది. వాటికి ఒక సామాజిక కోణం ఉంటుంది. అలాగే ఆ చట్టాన్ని ఉదారంగా నిర్వచించాల్సి వస్తుంది. అయితే ఆ ఉదారత ఆ చట్టం ఎవరి కోసం అయితే నిర్దేశించిందో వారికి అనుకూలంగా ఉండాలి కానీ, ఆ చట్టాన్నే నిర్వీర్యం చేసేటట్టు ఉండకూడదు. సుప్రీంకోర్టు జూలై 29న వనశక్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇచ్చిన తీర్పు ఒక ప్రజాప్రయోజనార్థ చట్టాన్ని ఆ చట్టం ఉద్దేశాలకు, మౌలిక స్వభావానికి భిన్నంగా నిర్వచించింది. ఆ చట్టం పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986.

పర్యావరణ పరిరక్షణ చట్టం కింద 1994లో పర్యావరణ ప్రభావ అంచనా ఉత్తర్వును విడుదల చేశారు. అందులోని షెడ్యూల్‌లో 'ఏ ప్రాజెక్టు కొత్తగా మొదలుపెట్టాలన్నా, ఉన్న ప్రాజెక్టును విస్తరించాలన్నా పర్యావరణ అనుమతి లేకుండా చేయడం కుదరదు' అని ఉంది. 2006లో తెచ్చిన కొత్త ఉత్తర్వులోనూ చాలా స్పష్టంగా-- ఏ ప్రాజెక్టు మొదలుపెట్టాలన్నా ముందస్తు పర్యావరణ అనుమతి తప్పనిసరి అని ఉంది. అంటే 1994లో అంతర్లీనంగా ఉన్నది, 2006 నాటికి ప్రస్ఫుటంగా ఉంది. అయితే ఈ చట్టాన్ని ఉల్లంఘించేవారిలో బలమైన పెట్టుబడిదారులు ఉన్నారు. వారు ఎటువంటి పర్యావరణ అనుమతి లేకుండా తమ ప్రాజెక్టులను నిర్మించడమేగాక, కొందరైతే నిర్మాణం పూర్తిచేసి ఆ పరిశ్రమలను నడిపేస్తున్నారు కూడా.

అలా అనుమతి లేకుండా నిర్మాణాలు చేసిన వారికి ఊరటగా కేంద్ర పర్యావరణ శాఖ 1994 నుంచి సడలింపు ఇస్తూ వచ్చింది. ఆ సడలింపు ప్రకారం, 'నిర్మాణం మొదలుపెట్టేశాక, లేదా పూర్తి చేసేశాక కూడా పర్యావరణ అనుమతి తీసుకోవచ్చు!'

# భాజపా, బీఆర్ఎస్

## ఒకే నాణేనికి బొమ్మా బొరుసు: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

నేను రైతుబంధును బంద్ చేయలేదు. 37 నెలల్లో 70లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.36 వేల కోట్ల రైతుబంధు నిధులు వేశాం. రెండుసార్లు సీఎం అయిన కేసీఆర్ రైతు రుణమాఫీ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రైతు రుణమాఫీ చేశాం. అప్పులు లేని రైతులు తెలంగాణలో ఉన్నారని కేంద్ర ప్రభుత్వమే చెప్పింది. 32 నెలల్లో వడ్లు కొని రూ.90 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. రైతులకు ఉచిత కరెంటు కోసం ఏడాదికి రూ.35 వేల కోట్లు చెల్లిస్తున్నాం. రైతుల కోసం ఇప్పటివరకు లక్షా 75వేల కోట్లు ఖర్చు చేశాం. కాంగ్రెస్ హయాంలో రైతు రాజు అయ్యాడు.

### మహిళలకు ఈసారి చిలకపచ్చ చీరలు

"మీ తమ్ముడు రేవంత్ రెడ్డిని ఆశీర్వదించడానికి మేం ఇచ్చిన పాలపిట్ట చీర కట్టుకొని మహిళలు వచ్చారు. ఈసారి మహిళలకు సారె కింద చిలకపచ్చ చీరలు పంపిణీ చేస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించాం. ఉచిత బస్సు పథకానికి రూ.11 వేల కోట్లు ఆర్టీసీకి ఇచ్చాం. మా అక్కలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తుంటే ఆ ఛార్జీలు నేను కడుతున్నా"

### ఎవరి ప్రలోభాలకు గురికావొద్దు.. నిరుద్యోగులకు సీఎం సూచన

"గుడి, బడి లేని ఊరు ఉండొచ్చేమో గానీ.. ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు మాత్రం ఉండదు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే మహిళల రాజ్యం. మహిళలకు ఐదేళ్లు మంత్రి పదవి ఇవ్వని కేసీఆర్ ఇప్పుడు వారి గురించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ కుటుంబం, బంధువులకు ఉద్యోగాలు ఇచ్చారు.. కానీ, మన పిల్లలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదు. ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్లు వస్తాయి. నిరుద్యోగులు చదువుకోవాలి. ఎవరి ప్రలోభాలకూ గురికావొద్దు. మీకు ఉద్యోగాలిచ్చే బాధ్యత మాది.. ఆదుకొనే బాధ్యత మాది. దుర్మార్గులు మీ వద్దకు వస్తారు.. మాయమాటలు చెప్తారు.. నమ్మకండి. విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్తున్నాం. సంక్షోభంలో ఉన్నా సంక్షేమం వైపు కొనసాగిస్తున్నాం. 12 ఏళ్ల భాజపా పాలన, పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల మా పాలన పోల్చి చూడండి" అని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# అర్హులందరికీ

## రేషన్ కార్డులిస్తాం: మంత్రి ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి

"ఈ రోజు చరిత్రలో పండుగలా గుర్తుండిపోతుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 16 లక్షల కొత్త కార్డులు ఇచ్చాం. గతంలో రేషన్‌లో దొడ్డు బియ్యం వచ్చేవి. ఆ బియ్యాన్ని 80 శాతం మంది తినేవారు కాదు. కానీ, కాంగ్రెస్ సర్కార్ వచ్చాక సన్నబియ్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొంటున్నాం. మనిషికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వడం లేదు. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారి అర్హతలను పరిశీలించి కార్డులు ఇస్తాం" అని ఉత్తమ్ తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డు అంటే కుటుంబానికి గౌరవం: మహేశ్‌కుమార్ గౌడ్

స్మార్ట్ రేషన్ కార్డు అంటే కుటుంబానికి గౌరవమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు అంటే ఆహార భద్రత, ప్రభుత్వం ఇచ్చే ఒక గుర్తింపు అని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు ఇక్కడ అమలు చేస్తున్నామని, నియోజకవర్గానికి మూడు వేల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు.

# రేవంత్‌వి అసత్యాలు..

## నిరుద్యోగులే గుణపాఠం చెబుతారు: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

జిల్లాలో ఒక్క కి.మీ రోడ్డైనా వేశారా? అని ప్రశ్నించారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

"బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి గతంలో అసెంబ్లీలో చెప్పారు. ఇవాళ బీఆర్ఎస్ రేషన్ కార్డులు ఇవ్వలేదని అవాస్తవాలు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16వేల ఉద్యోగాలు ఇచ్చిందని అసెంబ్లీలో చెప్పారు. సంగారెడ్డి సభలో 70వేల ఉద్యోగాలు ఇచ్చామని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసగించారు. అసత్యాలు చెబుతున్న ముఖ్యమంత్రికి నిరుద్యోగులే గుణపాఠం చెబుతారు. రెండేళ్ల నుంచి బకాయిలు ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఎప్పుడు ఇస్తారు?" అని నిలదీశారు.

# హైకోర్టులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

మొదటి పేజీ తరువాయి



**అమరావతి, ఆగస్టు 15 :**
ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నవభారత నిర్మాణంలో ప్రతి పౌరుడూ బాధ్యతగా భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

### పారదర్శక న్యాయం

సామాన్యులకు తక్కువ ఖర్చుతో వేగవంతమైన న్యాయం అందించడమే తమ లక్ష్యమని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఈ ఏడాది నిర్వహించిన 4 లోక్ అదాలత్‌ల ద్వారా 13,95,017 కేసులను సామరస్యంగా పరిష్కరించామని వివరించారు. రాజ్యాంగ విలువల పరిరక్షణకు న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### హాజరైన ప్రముఖులు

ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, చల్లా ధనుంజయ్, ద్వారకానాథ్ రెడ్డి, ప్రభునాథ్ వాసిరెడ్డి, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, ఆగస్టు 15 :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ మహనీయుల అపార త్యాగాలతోనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడమే వారికిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

### చట్టసభల పనితీరుపై అవగాహన

ప్రజాస్వామ్యంలో ప్రజలకు, విద్యార్థులకు చట్టసభల పనితీరుపై పూర్తి అవగాహన ఉండాలని స్పీకర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశామని వివరించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం క్వార్టర్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరలోనే కేటాయింపులు పూర్తి చేస్తామని చెప్పారు.

### హాజరైన ప్రముఖులు

ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావు, సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకుంటున్న ప్రభుత్వ ప్రగతి శకటాలు

మొదటి పేజీ తరువాయి




**విజయవాడ, ఆగస్టు 15 :**
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన అలంకృత శకటాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని సమాచార పౌర సంబంధాల శాఖ ఇన్‌చార్జ్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు తెలిపారు. రాజధాని అమరావతి నేలపాడు పరేడ్ మైదానంలో వేడుకల అనంతరం విజయవాడ, గుంటూరుతో పాటు సీఆర్‌డీఏ పరిధిలో ప్రజల సందర్శనార్థం ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు.

### ప్రధాన కేంద్రాల్లో ప్రదర్శన

విజయవాడ ఎంజీ రోడ్డులోని అంబేద్కర్ స్మృతివనం వద్ద 14 శాఖల శకటాలు, కనకదుర్గ గుడి రథం సెంటర్ వద్ద రెండు శకటాలు, గుంటూరు నగరంలో మూడు శకటాలు, సీఆర్‌డీఏ గ్రామాల్లో పలు శాఖల శకటాలను ఉంచారు.

### 17 వరకు అందుబాటులో

రాష్ట్ర ప్రగతిని వివరించే ఈ శకటాల ప్రదర్శన శనివారం నుంచి ఈ నెల 17వ తేదీ సోమవారం వరకు ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు.

# ఒక గంట సమయం ఇవ్వండి..

మొదటి పేజీ తరువాయి

అని యువత ఆలోచిస్తూ ఉండొచ్చు. వారి భాగస్వామ్యంతో ప్రతి ఇంట్లో జనాభా గణనకు ఒక అనుకూల వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో ప్రజలు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం" అని మోదీ పేర్కొన్నారు.

### ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేసిన ప్రధాని మోదీ

అలాగే 'దిమాగీ నక్సల్స్' గురించి మాట్లాడుతూ.. వారిని దేశానికి కొత్త శత్రువులుగా అభివర్ణించారు. "సంవత్సరాలుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశంలో బలంగా పాతుకుపోయారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. సాయుధ నక్సల్స్ కనుమరుగైనా.. 'దిమాగీ నక్సల్స్' మిగిలి ఉన్నారు. వారు ఒక అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలి" అని సూచించారు.

తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగం, గ్రీన్ అండ్ బ్లూ ఎకానమీ, ఇండియాస్ సాఫ్ట్ పవర్ కోసం 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను మోదీ ప్రకటించారు (×అనవజూవఅనవఅఞవ ఋఖఎ).

### మహిళా బిల్లు ప్రస్తావన..

మహిళా కోటా బిల్లుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. తన ప్రసంగంలో దాని ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రతిపక్షాలు విభేదాలను పక్కనపెట్టి.. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కోరారు.

### హాజరు కానీ ఖర్గే, రాహుల్ గాంధీ..

స్వాతంత్ర్య వేడుకల్లో ఈసారి కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. సీటింగ్, ఇతర ప్రొటోకాల్స్ వారి పదవులకు అనుగుణంగా ఉండటం లేదని కాంగ్రెస్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారు వరుసగా రెండోసారి గైర్హాజరయ్యారు.

# స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం



### రైతులకు ప్రోత్సాహం

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేల సాయం అందిస్తున్నామని తెలిపారు. ఉద్యానవన పంటలకు మద్దతు ధర ఇచ్చి ఆదుకున్నామని, రూ.లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తున్నామని చెప్పారు. ఆక్వా సాగును ప్రోత్సహించేందుకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తున్నామని తెలిపారు.

### సాగునీటి ప్రాజెక్టుల వేగం

రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులు 89 శాతం పూర్తయ్యాయని, వచ్చే పుష్కరాల నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వివరించారు. వెలిగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులను వేగవంతం చేశామని చెప్పారు.

### మౌలిక వసతుల విస్తరణ

రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని, రూ.64 వేల కోట్ల రైల్వే, రూ.38 వేల కోట్ల హైవే పనులు జరుగుతున్నాయని తెలిపారు. అమరావతిని కాలుష్య రహిత, గ్రీన్ సిటీగా నిర్మిస్తున్నామని, రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

### పాలనా సంస్కరణలు

పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు మార్కాపురం, పోలవరం నూతన జిల్లాలను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తూ ప్రజలకు మేలు చేకూర్చామని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రూ.30,849 కోట్ల బకాయిలు విడుదల చేశామని చెప్పారు. మహిళా సాధికారతకు స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు.

### రక్షణ, పురస్కారాలు

రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఈగల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వేడుకల్లో భాగంగా ఆకట్టుకున్న శాఖల శకటాల ప్రదర్శనను తిలకించి, విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఆయన మెడల్స్ అందజేశారు.

# మహిళా సాధికారతకు 'స్త్రీ శక్తి' బాట

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, ఆగస్టు 15 :**
స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ప్రయాణ స్వేచ్ఛతో పాటు ఆర్థిక స్వాతంత్ర్యం, ఆత్మవిశ్వాసం రెట్టింపయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పథకం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా రాజధాని అమరావతిలో మహిళలతో కలిసి ఆయన ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో వారికి తేనీటి విందు ఏర్పాటు చేసి వారి ఆదాయం, ఉపాధి, కుటుంబ పరిస్థితులపై ఆత్మీయంగా మాట్లాడారు.

### ఉచిత ప్రయాణాలతో ఆదా

ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 87 కోట్ల ఉచిత ప్రయాణాలు జరిగాయని, రోజుకు సగటున 24 లక్షల ప్రయాణాలు నమోదవుతున్నాయని సీఎం తెలిపారు. బస్సు చార్జీల రూపంలో మిగులుతున్న డబ్బును మహిళలు తమ కుటుంబ అవసరాలకు, వ్యాపార పెట్టుబడులకు వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు.

### మహిళా వ్యాపారులకు అండ

ఉచిత బస్సు ప్రయాణం వల్ల మత్స్యకార, చేనేత, చిన్న తరహా వ్యాపారాలు చేసే మహిళలకు నెలకు వేల రూపాయలు ఆదా అవుతున్నాయని లబ్ధిదారులు తెలిపారు. పొదుపు చేసుకున్న మొత్తాన్ని పెట్టుబడిగా మలుచుకుని తాము సంపాదిస్తూ మరికొందరికి ఉపాధి చూపిస్తున్నామని సీఎంతో పంచుకున్నారు.

### విద్యార్థినులకు వరం

ఈ పథకం చదువుకునే విద్యార్థినులకు ఎంతో ఉపయోగపడుతోందని, కుటుంబ ఖర్చులు తగ్గాయని పలువురు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు.

### లక్ష్యాల సాధన దిశగా

రాబోయే పదేళ్లలో వ్యాపారాలు, ఏఐ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలన్న మహిళల ఆకాంక్షలను సీఎం అభినందించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే కుటుంబం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని, ప్రతి ఒక్కరూ 'అను నేను' సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులు

## ప్రారంభించిన పవన్ కళ్యాణ్

మొదటి పేజీ తరువాయి

### ముడిసరుకు సమస్యకు పరిష్కారం



ఈ బ్యాంకుల ద్వారా రాష్ట్రంలోని 5,000 హస్తకళాకారుల కుటుంబాలకు కలప కొరత తీరనుంది. కొండపల్లి, ఏటికొప్పాక, బొబ్బిలి వీణల తయారీదారుల కోసం కలపను అందుబాటులో ఉంచామని, వచ్చే ఐదేళ్లకు సరిపడా నిల్వలు సమకూరుస్తామని అధికారులు తెలిపారు.

### క్యూఆర్ కోడ్ పరిశీలన

కలప దుంగలు, కళాకృతులపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను పవన్ కళ్యాణ్ స్కాన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. కళాకారులతో మాట్లాడి తయారీ విధానం, సమస్యలను అడిగి తెలుసుకుని పలు కళాకృతులను కొనుగోలు చేశారు.

### హాజరైన ప్రముఖులు

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సోము వీర్రాజు, బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్, ఉన్నతాధికారులు కాంతిలాల్ దండే, పి.వి. చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# 6 నెలల స్వల్ప వ్యవధిలోనే 'జిల్లా ఉత్తమ గ్రామపంచాయతీ' అవార్డు సొంతం

- మల్లారం సర్పంచ్ అర్పిత రెడ్డి సమర్థ నాయకత్వానికి విశిష్ట గుర్తింపు
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆది శ్రీనివాస్ చేతులమీదుగా పురస్కారం ప్రదానం
- జాతీయ వేదికపై 'డిజిటల్ కృషి' ప్రథమ బహుమతి నుంచి నేటి జిల్లా స్థాయి అవార్డు వరకు మల్లారం ఆదర్శ పయనం
- తాగునీటి వ్యవస్థలో డిజిటల్ విప్లవం: ఓపెన్ వెల్ సిస్టమ్, వాటర్ టైమర్లతో కరెంట్ బిల్లుల భారానికి చెక్
- పల్లెల్లో సోలార్ వెలుగులు: 10 సోలార్ దీపాలు, 4 హైమాస్ట్ లైట్లతో మారిన గ్రామీణ ముఖచిత్రం
- సమిష్టి కృషికి గౌరవమిది: గ్రామాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానన్న సర్పంచ్ సంగం అర్పిత వీరారెడ్డి

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 15

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ డిజిటల్ బాటలో సాగుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ గ్రామీణ మండలం మల్లారం గ్రామ పంచాయతీ పల్లె ప్రగతిలో సరికొత్త మైలురాళ్లను అధిగమిస్తోంది. మొన్ననే కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'సర్పంచ్ సంవాద్' వేదికగా 'డిజిటల్ కృషి - సమృద్ధి గావ్' జాతీయ స్థాయి పోటీల్లో మల్లారం సర్పంచ్ సంగం అర్పిత వీరారెడ్డి దేశంలోనే ప్రథమ బహుమతి సాధించి గ్రామానికి అంతర్జాతీయ, జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చారు. గ్రామ పంచాయతీ కోసం ప్రత్యేకంగా డిజిటల్ వెబ్‌సైట్‌ను రూపొందించడమే కాకుండా, గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల మెరుగుదల మరియు ప్రజా సంక్షేమంలో చూపిన అసాధారణ ప్రగతికి గాను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మల్లారం గ్రామపంచాయతీ నేడు జిల్లా స్థాయి 'ఉత్తమ గ్రామపంచాయతీ' అవార్డును దక్కించుకుంది. సర్పంచ్ బాధ్యతలు స్వీకరించిన కేవలం ఆరు నెలల స్వల్ప వ్యవధిలోనే ఈ ప్రతిష్టాత్మక జిల్లా అవార్డును సాధించడం మల్లారం పంచాయతీ ప్రత్యేకతగా నిలిచింది. ఇంత తక్కువ వ్యవధిలో ఈ స్థాయి గుర్తింపును సాధించిన తొలి గ్రామంగా మల్లారం నిలిచిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాలనా కాలంలో మల్లారం గ్రామ పంచాయతీ పర్యావరణహిత సోలార్ విద్యుత్ వెలుగులు నింపుతూనే, తాగునీటి సరఫరా వ్యవస్థలో కూడా సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చింది. గ్రామంలోని డ్రింకింగ్ వాటర్ ట్యాంకులకు సంబంధించి కరెంట్ బిల్లుల భారానికి చెక్ పెడుతూ, పంపు సెట్లను నేరుగా ఆన్ మరియు ఆఫ్ చేసేందుకు వీలుగా ఆధునిక ఓపెన్ వెల్ డిజిటల్ సిస్టమ్‌ను అమర్చారు. దీనికి తోడు నీటి నిల్వలను ఎప్పటికప్పుడు సమర్థవంతంగా నిర్వహించేందుకు 3 డిజిటల్ వాటర్ టైమర్లను కూడా విజయవంతంగా ప్రారంభించారు. ఈ కొత్త సాంకేతికత వల్ల సమయానికి తాగునీరు అందడమే కాకుండా, విద్యుత్ మరియు నీటి వృధాను అరికట్టడం సాధ్యమైంది. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ ఖర్చులను నియంత్రించడంతో పాటు, గ్రామ ప్రజలకు మెరుగైన భద్రతను కల్పించాలనే ఉద్దేశంతో సర్పంచ్ సంగం అర్పిత వీరారెడ్డి ఆధ్వర్యంలో మల్లారంలోని ప్రధాన రహదారి, ముఖ్య



కూడళ్లలో ప్రాథమికంగా 10 సోలార్ విద్యుత్ వీధి లైట్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు గ్రామంలోని అంతర్గత వీధులన్నింటిలోనూ నాణ్యమైన ఎల్ఈడీ లైట్లను అమర్చి, ప్రధాన జంక్షన్లలో 4 హైమాస్ట్ లైట్లను అందుబాటులోకి తెచ్చారు. ప్రతి ఎల్ఈడీ స్తంభానికి ప్రత్యేక నంబరు కేటాయించి లైట్లు పాడైతే వెంటనే బాగు చేసేలా సాంకేతిక పర్యవేక్షణ వ్యవస్థను నెలకొల్పారు. సుదీర్ఘ వారెంటీ ఉన్న లైట్లను వాడటం ద్వారా పంచాయతీపై నెలనెలా పడే కరెంట్ బిల్లుల భారం భారీగా తగ్గనుంది. నేడు లభించిన ఈ జిల్లా ఉత్తమ అవార్డుపై సర్పంచ్ అర్పిత రెడ్డి సంగం మాట్లాడుతూ... "ఈ అవార్డు నా వ్యక్తిగత విజయం కాదు. మల్లారం గ్రామ ప్రజలందరి సహకారం, గ్రామపంచాయతీ సభ్యులు, సిబ్బంది మరియు అధికారుల సమిష్టి కృషికి దక్కిన గుర్తింపు. రాబోయే రోజుల్లో కూడా మల్లారాన్ని మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తాను" అని తెలిపారు. డిజిటల్ వ్యవసాయం నుంచి నేటి సోలార్ వెలుగులు, తాగునీటి నిర్వహణ వరకు ఆరు నెలల స్వల్ప వ్యవధిలోనే మల్లారం సాధించిన ఈ విజయం జిల్లాలోని ఇతర పల్లెలకు ఆదర్శంగా నిలుస్తోంది.

# కరీంనగర్-రేపాక నూతన బస్సుకు ఘన స్వాగతం

- రేపాక గ్రామంలో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన సర్పంచ్ కాత మల్లేశం, పాలకవర్గ సభ్యులు




ఇల్లంతకుంట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 15

ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరచే లక్ష్యంతో కరీంనగర్ నుండి రేపాక వరకు నూతనంగా ప్రారంభమైన ఆర్టీసీ బస్సుకు రేపాక గ్రామంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాత మల్లేశం ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి బస్సును ప్రారంభించారు. గ్రామ ప్రజలు, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు కలిసి బస్సుకు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఈ నూతన బస్సు సేవల ద్వారా విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు మరియు గ్రామీణ ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడుతుందని సర్పంచ్ కాత మల్లేశం తెలిపారు. కరీంనగర్‌కు నేరుగా బస్సు సౌకర్యం కల్పించడం గ్రామ ప్రజల చిరకాల కోరిక అని, ఆ కోరిక నెరవేరడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, యువకులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ సంబరాలు

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 15



ఎందరో మహనీయుల త్యాగాలు, అమరవీరుల ప్రాణత్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ౹ఖఔజీ ఎ 143 వేములవాడ ప్రెస్ క్లబ్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ గీతాన్ని విద్యార్థినీలు ఆలపించగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిపాక నరసయ్య మూడు రంగుల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు,జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, నరసయ్య లు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరంలో దేశం కోసం కుల, మత,వర్ణ తేడాలు లేకుండా తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అమరవీరుల ఆశయ సాధన కోసం దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుతూ, సమగ్ర అభివృద్ధి, సంక్షేమం, స్వేచ్ఛ, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. యువతకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలిపేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో దేశం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన ప్రతి ఒక్క అమరవీరుడికి తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ల సంఘం పక్షాన ఘన నివాళులర్పించారు. దేశ ప్రగతిలో జర్నలిస్టులు కూడా బాధ్యతాయుత పాత్ర పోషిస్తూ ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గం, సభ్యులు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే మన స్వాతంత్ర్యం: వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

- మున్సిపల్ కార్యాలయంలో వైభవంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- తొలిసారిగా మున్సిపల్ భవనంపై జాతీయ జెండా ఆవిష్కరించిన చైర్మన్ పుల్కం రాజు
- గాంధీ, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి: వేములవాడలో జెండా ఎగురవేసిన మున్సిపల్ చైర్మన్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సారథ్యంలో వేములవాడ అభివృద్ధికి నిరంతర కృషి: పుల్కం రాజు

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 15

పట్టణ కాంగ్రెస్, సింగిల్ విండో, మున్నూరు కాపు సంఘాలలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ ఎందరో మహనీయుల ప్రాణత్యాగాలు, పోరాటాల ఫలితంగానే భారతావని స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటోందని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కొనియాడారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణ మున్సిపల్ కార్యాలయంలో శనివారం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన తర్వాత ఇది తొలి స్వాతంత్ర్య దినోత్సవం కావడం విశేషం. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ భవనంపై చైర్మన్ పుల్కం రాజు మున్సిపల్ పాలకవర్గంతరుపున తొలిసారిగా జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడం వెనుక వేలాది మంది త్యాగధనుల కష్టం ఉందని గుర్తుచేశారు. మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, పటేల్ వంటి ఎందరో మహనీయులు చూపిన ధైర్యం, చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. వారి త్యాగాలను ఎప్పటికీ మరువలేమని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశంలోనే అగ్రగామిగా దూసుకుపోవాలని ఆకాంక్షించారు. వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సారథ్యంలో వేములవాడ పట్టణం అన్ని రంగాల్లో మరింత వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంతో పాటు పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ



కార్యాలయం, సింగిల్ విండో సొసైటీ ఆవరణ, మున్నూరు కాపు సంఘం భవనం వద్ద జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన హాజరై జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. మహనీయుల ఆశయ సాధనకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, కోఆప్షన్ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, వివిద పార్టీల నాయకులు, మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బావుసాయిపేట ప్రభుత్వ స్కూల్లో ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు

కోనరావుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 15




కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట ప్రభుత్వ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కన్నులపండువగా జరిగాయి. వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన శారీరక విన్యాసాలు, కరాటే, పిరమిడ్ ప్రదర్శనలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన సాహస విన్యాసాలకు గ్రామస్థులు, తల్లిదండ్రులు ముగ్ధులై కరతాళ ధ్వనులతో అభినందించారు. చదువుతో పాటు క్రీడలు, విన్యాసాల్లో రాణించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఎస్ఎమ్‌సీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టు ఆవరణలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..



రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 15

రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు సెషన్స్ జడ్జి పుష్పలత జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వేడుకల అనంతరం చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 15



రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే జాతీయ జెండాను ఎగురవేసి పోలీస్ అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని,వారి త్యాగాల స్ఫూర్తితో దేశ సమగ్రత, ఐక్యతతో పాటు శాంతి భద్రతలను పరిరక్షించడంలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గారు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, చట్టబద్ధ పాలనతో పాటు ప్రజలకు స్నేహపూర్వకమైన, పారదర్శకమైన, సాంకేతికత ఆధారిత పోలీసింగ్ సేవలను అందించడమే ప్రతి పోలీస్ అధికారి పని చేయాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సి.ఐ లు, ఆర్.ఐ లు, ఏ. ఓ, ఎస్.ఐ లు కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యంత ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్

రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 15



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆవరణలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఎందరో మహనీయుల అతులిత త్యాగ ఫలితంగానే భారతావనికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది నిరంతరం సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే మన అమరవీరులకు ఇచ్చే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. వైద్య సేవల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఆసుపత్రి అభివృద్ధికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.హెచ్. సంతోష్ కుమార్, సి.ఎస్. ఆర్.ఎం.ఓ డాక్టర్ ఎ. సుమన్ మోహన్ రావు, డిప్యూటీ సి.ఎస్. ఆర్.ఎం.ఓ డాక్టర్ జె. కాశీనాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.డి. అసీఫ్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ రమాదేవితో పాటు పలువురు ప్రభుత్వ వైద్యాధికారులు, హెడ్ నర్సులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 15



సిరిసిల్ల జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఎలాగొండ రవి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యశ్రీ వచ్చి 80 సంవత్సరాలు అయిన సందర్భంగా జిల్లా కవులకు మరియు రచయితలకు శుభాకాంక్షలు తెలపడం జరిగినది అంతేకాకుండా. . అలాగే సీ.సా.స అధ్యక్షులు జనపాల శంకరయ్య సిరిసిల్ల జిల్లాలోని యువ రచయితలు ముందుకు రావాలని సమాజ శ్రేయస్సుకు తమ కలాలను ఎక్కు పెట్టాలని కోరారు. సీ.సా.స గౌరవ అధ్యక్షులు కోడం నారాయణ, మాట్లాడుతూ స్వాతంత్రం ఎందరో మహానుభావులు వల్ల సిద్ధించిందని వారి అడుగుజాడల్లో నేటి యువత నడవాలని కోరారు. మరియు సాహితీవేత్త చిటికెన కిరణ్ కుమార్,జిల్లా రచయితల సంఘం యువజన కార్యదర్శి అంకారపు రవి,కరికె నరేందర్, దూడం గణేష్, రచయితలు పాల్గొన్నారు.

# జాతీయ జెండాను ఆవిష్కరించిన యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు న్యాత నవీన్

- యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో కీలక పాత్ర పోషించాలి
- అంబేద్కర్ ఆశయాలే సమానత్వానికి మార్గం: రాజ్యాంగ విలువల పరిరక్షణే లక్ష్యం
- మిత్రులు, కార్యకర్తలే నా బలం.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతాం

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 15

80వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని నంది చౌరస్తా వద్ద శనివారం వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ గీతం ఆలపించి తమ దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా న్యాత నవీన్ మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడం వెనుక వేలాది మంది మహనీయుల అతులిత త్యాగాలు, సుదీర్ఘ పోరాటాలు ఉన్నాయని స్మరించుకున్నారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల పోరాట పటిమను ప్రతి భారతీయుడు ఎప్పటికీ గుర్తుంచుకోవాలని అన్నారు. మన చేతిలో రెపరెపలాడుతున్న జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది కోట్లాది భారతీయుల ఆశలకు, అమరవీరుల పోరాటాలకు, స్వేచ్ఛాకాంక్షకు సజీవ ప్రతీక అని అభివర్ణించారు. ఆ మహనీయులు కన్న కలలను, ఆశయాలను నిజం చేయడమే నేటి తరానికి ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలను కొనియాడుతూ, ఆయన రూపొందించిన రాజ్యాంగం దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం అనే గొప్ప విలువలను అందించిందని పేర్కొన్నారు. అంబేద్కర్ ప్రతి పౌరుడికి ఆత్మగౌరవంతో జీవించే హక్కును కల్పించారని, పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం తన జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఇన్ని ఏళ్లయినా సామాజిక అసమానతలు, వివక్ష పూర్తిగా తొలగిపోయినప్పుడే ఆ స్వాతంత్ర్య స్ఫూర్తికి సంపూర్ణ అర్థం లభిస్తుందని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక ధర్మమని అన్నారు. దేశ భవిష్యత్తు పూర్తిగా యువత చేతుల్లోనే ఉందన్న న్యాత నవీన్, యువత రాజకీయాలకు దూరంగా ఉండకుండా ప్రజాసేవలోకి వచ్చి చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. రాజకీయాలు అంటే కేవలం పదవులు అనుభవించడం కాదని, ప్రజల కష్టాల్లో తోడుగా నిలబడే గొప్ప బాధ్యత అని వ్యాఖ్యానించారు. అధికార దాహం కోసం కాకుండా, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే నాయకత్వం నేడు అత్యవసరమని అభిప్రాయపడ్డారు. యువత రాజకీయ రంగంలోకి అడుగుపెడితేనే నూతన ఆలోచనలు, గుణాత్మక మార్పు, బలమైన నాయకత్వం ఉత్పన్నమవుతాయని వివరించారు.



వేములవాడ నియోజకవర్గంలో యువ శక్తిని ఏకం చేస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాసేవే లక్ష్యంగా మరింత బలంగా ముందుకు సాగుతామని వెల్లడించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తన సహచరులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు న్యాత నవీన్ భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు. తాను ఒక్క పిలుపునిస్తే చాలు సమయంతో పనిలేకుండా నా వెంటే నిలబడే మిత్రులు తనకు కొండంత బలాన్ని ఇస్తారని కొనియాడారు. ప్రజా సమస్యలపై పోరాటమైనా, పార్టీ పిలుపు మేరకు చేపట్టే కార్యక్రమాలైనా ముందుండి నడిపించే సహచరులందరినీ కార్యకర్తలుగా కాకుండా సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తానని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, అంబేద్కర్ రాజ్యాంగ మార్గంలో నడుస్తూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ, యువతను సేవా మార్గంలో నడిపించడమే తమ చరమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు, మిత్రబృందం, స్థానిక నాయకులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిరిసిల్ల లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 15



ప్రజా ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా పౌర సరఫరాల శాఖ ఆద్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఉన్న ఫంక్షన్ హాల్లో నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి మండలానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ . ప్రజా ప్రభుత్వం జిల్లాలో 24,174 నూతన రేషన్ కార్డులను మంజూరు చేసిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,95,915 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు గుర్తింపు కార్డు మాత్రమే కాదని, పేదలకు గౌరవంతో పాటు ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలకు ఉపయోగపడే ముఖ్యమైన పత్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారుల ద్వారా పట్టణాలు, గ్రామాల వారీగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని తెలిపారు. పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రతి నెలా 3,700 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పేదలకు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. సంపన్నులు తినే సన్నబియ్యాన్ని పేదలు కూడా తినాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు.

### ఇతర రాష్ట్రాల్లో అమలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటి పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేశామని, రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం కల్పించామని తెలిపారు. రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి రాష్ట్రవ్యాప్తంగా రూ. 21,650 కోట్ల మేర ప్రయోజనం కల్పించామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. జిల్లా నేతన్నలకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జిల్లాలో చేనేత, వస్త్ర పరిశ్రమకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతు న్నాయని, మహిళలకు పంపిణీ చేసే చీరల తయారీకి సిరిసిల్ల కేంద్రంగా నిలుస్తోందన్నారు. జిల్లాలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం, రైతులు, మహిళలు, నేతన్నలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

### ప్రతి రేషన్ లబ్ధిదారుడికి సన్నబియ్యం

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించామని తెలిపారు. భారత రాజ్యాంగం ద్వారా వచ్చిన జీవించే హక్కు లో భాగంగా రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్నబియ్యం, సరకులు పంపిణీ చేస్తున్నారని వివరించారు. జిల్లాలో మొత్తం 1,95,915 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ప్రతి మండలానికి ఐదు చొప్పున పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. సోమవారం అన్ని మండలాల్లో పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులతో టీ రేషన్ యాప్ లో రేషన్ సరుకులు, రేషన్ దుకాణాలు, స్టాక్ నిలువలు, పూర్తి వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ విద్యాలయాలు, ప్రభుత్వ విద్యాలయాలు, రేషన్ కార్డు దారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో గత యాసంగిలో 3 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్మన్లు జిందం కళ, పుల్కం రాజు, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు కే ఎస్ బీ కుమారి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, ఆయా మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు సమన్యాయం జరిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం: పాలాస నరేందర్

- వేములవాడ హమాలీ కార్యాలయం వద్ద ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ
- కొత్త కార్మిక చట్టాలను పారదర్శకంగా అమలు చేయాలి: హమాలీ సంఘం డిమాండ్
- కార్మిక కుటుంబాలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి





వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 15

80వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవాడ మండల హమాలీ కార్మిక కార్యాలయం వద్ద సంఘ గౌరవ అధ్యక్షులు పొలాస నరేందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద సంఘటిత, అసంఘటిత కార్మికులకు శ్రమకు తగిన కూలీలు, వేతనాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలంచెల్లిన పాత కార్మిక చట్టాలను పక్కన పెట్టి, ప్రస్తుత కాలానికి అనుగుణంగా కొత్త చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. వాటిని పారదర్శకంగా, పటిష్టంగా మరియు చట్టబద్ధంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.స్వాతంత్ర్య, రాజ్యాంగ ఫలాలు సమాజంలో అట్టడుగున ఉన్న బడుగు, బలహీన వర్గాలకు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి, అణగారిన సబ్బండ వర్గాలకు సంపూర్ణంగా అందాలని స్పష్టం చేశారు. కార్మిక లోకానికి సామాజిక న్యాయం, సమన్యాయం జరిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లవుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా కార్మికులకు, వారి కుటుంబాలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం, బీమా వసతితో పాటు నిత్యవసర వస్తువులను అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ వేడుకల్లో హమాలీ సంఘం అధ్యక్షుడు గజ్జెల శేఖర్, సంఘ నాయకులు ముక్కెర స్వామి, బైరి రాజేశం, లింగాపురం పోచమల్లు, గుండం దాస్, పిట్టల భూమయ్య, షురూవు వెంకటేష్, లింగాపురం రాములు, ఏల్పుల రాజయ్య, ఏల్పుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కోనరావుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 15



భారతదేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలు అమోఘమైనవని కోనరావుపేట తహసీల్దార్ వరలక్ష్మి కొనియాడారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.?ఈ సందర్భంగా తహసీల్దార్ వరలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం సిబ్బందికి, కార్యక్రమానికి హాజరైన ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధులు చూపిన బాటలో నడుస్తూ, దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ ప్రాంతీయ అభివృద్ధికి కృషి చేయడమే మన మహనీయులకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బావుసాయిపేటలో వర్షపు వరదకు కొట్టుకుపోయిన రహదారి..

- విద్యార్థులు, పల్లె ప్రజలకు తప్పని ప్రయాణ తిప్పలు
- నిలిచిపోయిన బస్సులు: స్కూలు పిల్లల ఇబ్బందులపై తక్షణమే స్పందించిన సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా
- తాత్కాలికంగా మట్టి పోయించి రాకపోకల పునరుద్ధరణ: త్వరలోనే శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కృషి

కోనరావుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 15

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొనరావుపేట మండలం బావుసాయిపేట మరియు వెంకట్రావుపేట గ్రామాల మధ్య గల రహదారి వరద ఉధృతికి దెబ్బతిని తీవ్రంగా పాడైంది. రోడ్డు గుంతలమయమై దెబ్బతినడంతో ఆ దారి గుండా స్కూల్ బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనివల్ల ప్రతిరోజూ బడులకు వెళ్లే పాఠశాల పిల్లలతో పాటు, మండల కేంద్రానికి వెళ్లే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన బావుసాయిపేట గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా వెంటనే స్పందించారు. విద్యార్థులు, ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించేందుకు తక్షణమే మట్టి ట్రాక్టర్లను తెప్పించి, దెబ్బతిన్న రహదారిపై మట్టి పోయించి చదును చేయించారు. రహదారిని పునరుద్ధరించడంతో స్కూల్ బస్సులు మరియు ఇతర వాహనాల రాకపోకలు సుగమమయ్యాయి.ఈ సందర్భంగా సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా మాట్లాడుతూ... "వర్షాల వల్ల రోడ్డు దెబ్బతిని స్కూల్ పిల్లలు పాఠశాలలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారని తెలిసిన వెంటనే తాత్కాలికంగా మట్టి పోయించి రహదారిని చదును చేయించాం. విద్యార్థుల చదువుకు, గ్రామస్తుల ప్రయాణానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకే ఈ చర్యలు







తీసుకున్నాం. త్వరలోనే ఈ రహదారికి శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తాం" అని తెలిపారు. ప్రజల మరియు పిల్లల ఇబ్బందులను గుర్తించి తక్షణమే స్పందించి రహదారికి మరమ్మతులు చేయించిన సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషాకు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# శ్రావణమాసంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి: ప్రభుత్వ విప్

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 15




రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని గౌరవ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు శ్రీ ఆది శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తివాచనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో అర్చకులు, వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.ఈ సందర్భంగా దేవస్థానం డీఈవో నవీన్ కుమార్, ఎమ్మెల్యే గారికి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.తదనంతరం ఆలయ మండపంలో డీఈవో నవీన్ కుమార్, ఏఈఓ మహేష్, ఆ పర్యవేక్షకులు నరేందర్ సీనియర్ అసిస్టెంట్ వంశీ శర్మ, ఆలయ అర్చకులతో కలిసి సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ గారు, శ్రావణమాసంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు మెరుగైన సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

# ఆర్ఎంపీ డాక్టర్ బలవన్మరణం.. పారాక్వాట్ తాగి మృతి



కరీంనగర్ జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 15

కరీంనగర్ జిల్లా మానకొండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేగురుపల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. చెడు అలవాట్ల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఓ ఆర్ఎంపీ వైద్యుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేగురుపల్లికి చెందిన మండల సంతోష్‌రెడ్డి (47) ఆర్ఎంపీ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు మద్యం తదితర వ్యసనాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన సంతోష్‌రెడ్డి ఆగస్టు 13న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంట్లోనే పారాక్వాట్ విషం సేవించారు.కొద్దిసేపటికే తీవ్ర కడుపునొప్పి రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కరీంనగర్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో అదే రోజు సాయంత్రం 6:26 గంటలకు మృతి చెందారు. ఈ ఘటనపై మృతుడి భార్య మండల లీలావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగస్టు 14న ఉదయం మానకొండూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగిస్తున్నారు.

# సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమం.. విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 15

సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా శనివారం రోజున శాభాష్ పల్లి లో ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రం లో విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చిన్నారులకు నోట్‌బుక్స్, పలకలు, పెన్సిల్లు, పెన్నులు, అందజేసి వారి విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించారు.ఈ కార్యక్రమానికి హాజరైనా సర్పంచ్ ఏ.టి యాదవ్,ఉప సర్పంచ్ పండుగ శ్రీనివాస్,వార్డ్ మెంబర్స్,ప్రధానోపాధ్యాయుడు సునీల్,ఉపాధ్యాయురాలు రమాదేవి ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏద్దండి రాజు, ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబు రావు, ట్రస్ట్ కోశాధికారి దూలం భూమేష్ గౌడ్,వేముల సతీష్,దర్శనాల సాయి,సంద్రగిరి రమేష్,అల్లాడి శివసాయి,హరి ప్రసాద్, గొట్టే నవీన్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు ఆనందంగా విద్యా సామగ్రిని స్వీకరించగా, ట్రస్ట్ సభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి సిబ్బంది మరియు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో విద్యాభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని పలువురు కొనియాడారు.

# స్వాతంత్ర దినోత్సవ జెండాను ఆవిష్కరించిన ఎమ్మార్వో ఫారుక్



ముస్తాబాద్/ ఆగస్టు 15 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండల రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ ఫారుక్, మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో లచ్చాలు, పోలీస్ స్టేషన్లో ఎస్సై జ్యోతి, సెస్ కార్యాలయంలో డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎం ఏ ఓ అనూష, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఆఫీజ, మండల విద్య అధికారి కార్యాలయంలో ఎంఈఓ, ముస్తాబాద్ గ్రామపంచాయతీలో సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు బొంపల్లి సురేందర్ రావు, పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి, రాజీవ్ గాంధీ విగ్రహం ముందర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు, వివేకానంద విగ్రహం ముందర బిజెపి పట్టణ అధ్యక్షులు, పలు ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు కుల సంఘాలు స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు పూర్తి చేసుకుని 80 వసంతంలోనికి అడుగుపెడుతున్న సందర్భంలో పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేసి స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలిపారు స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పలు పాఠశాలల చిన్నారుల వేషధారణలు ప్రజలను ఆకట్టుకున్నాయి అలాగే విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక మండల ప్రధాన కూడలిలో కార్యక్రమాలు నిర్వహించారు

# సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 15



రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుమల స్వరూప తిరుపతి రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ స్వరూప మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రగతిలో రైతుల పాత్ర ఎంతో కీలకమని, రైతులకు అవసరమైన సహకారం అందించేందుకు మార్కెట్ కమిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్లు పొన్నాల పరుశురాం, ఆరేపల్లి శ్రీనివాస్ తదితర డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొమ్ముగుడెం లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ప్రజాదివాస్

భారతదేశ స్వాతంత్ర్యం పోరాటం లో పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు త్యాగాలను స్మరిస్తూ జాతీయ జెండా ఎగురవేసారు భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన త్యాగధనుల ఆశాయలను సాదిద్దం బి.ఆర్.ఎస్. పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం దమ్మపేట మండలం కొమ్ముగూడెం గ్రామం లో గ్రామ పంచాయతీ కార్యాలయం లో జరిగిన 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు లో విశిష్ట అతిథి గా హాజరు అయిన జిల్లా భారస నాయకులు సోయం వీరభద్రం అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం కొమ్ముగుడెం గ్రామం లో గ్రామ పంచాయతీ కార్యాలయం లో స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొమ్ముగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ సోయం సత్యవతి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగరవేసారు. విశిష్ట అతిథి గా బి.ఆర్.ఎస్. పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం గారు భారత స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మా గాంధీ చిత్రపటానికీ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికులు, అమరుల త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. విశిష్ట అతిథిగా ప్రసంగించిన భారస నాయకులు సోయం వీరభద్రం, మాట్లాడుతూ, సుమారు 200 సంవత్సరాల పాటు బ్రిటిష్ వలస పాలనలో భారతదేశం బానిసత్వాన్ని అనుభవించిందని, లక్షలాది మంది త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం లభించిందని అన్నారు. భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్, సర్దార్ వల్లభాయ్ పటేల్, అంబేద్కర్ అల్లూరి సీతారామరాజు, కొమురం భీం వంటి మహనీయులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశం, ప్రజల కోసం పోరాడారని గుర్తు చేశారు. వారి త్యాగాలను ఎప్పటికీ మరచిపోకూడదని, స్వాతంత్ర్య విలువలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల ఆశయాలను కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అని సోయం వీరభద్రం పేర్కొన్నారు. ఎంతోమంది త్యాగాల ఫలితమే మన స్వేచ్ఛ అని అన్నారు భారతదేశం కి స్వాతంత్ర్యం సులభంగా లభించలేదని, వలస పాలకులు 1857 సిపాయిల తిరుగుబాటు నుంచి 1947 వరకు అనేక పోరాటాలు, జైలు శిక్షలు, లాఠీ దెబ్బలు, ఉరికంబాలు, ప్రాణత్యాగాల అనంతరం దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. నేటి యువతరం స్వేచ్ఛగా జీవిస్తూ, విద్యను అభ్యసిస్తూ, తమ



అభిప్రాయాలను వ్యక్తం చేయగలుగుతున్నదంటే అందుకు నాటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలే కారణమని సోయం వీరభద్రం పేర్కొన్నారు. సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, వారి కుటుంబాలకు సమాజం అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుద్ధుల శ్రీను, వార్డు సభ్యులు బుద్ధుల కృష్ణ ,సోయం కృష్ణవేణి, మెరీ, వాడే విజయకుమారి, పుష్ప, సోయం ఎర్రయ్య, నరసింహ రావు, వెంకన్నబాబు సత్యనారాయణ, నరసింహ రావు, గోపి చెపా బాబురావు, పద్దం నరసింహ రావు, విజయలక్ష్మి, గ్రామ పంచాయతీ కార్యదర్శి వివిధ విభాగాలు ఉద్యోగులు యూత్ సభ్యులు, గ్రామస్థులకు, విద్యార్థులు ,మహిళ సోధరిమనులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

6

# పోలీస్ శాఖలో విశేష సేవలందించిన పోలీస్ అధికారులకు పతకాలు.

రాజన్న సిరిసిల్ల జిల్లా./ ప్రజాదివాస్ ఆగస్టు 15



పోలీస్ శాఖలో విధి నిర్వహణలో విశేషమైన సేవలు అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మకమైన పోలీస్ సేవా పతకాలకు ఎంపికైన జిల్లా పోలీస్ అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ పతకాలను అందజేసి అభినందించారు. విధి నిర్వహణలో అంకితభావంతో, కష్టపడి పనిచేసే పోలీస్ అధికారులు, సిబ్బందికి వారి సేవలకు తగిన గుర్తింపు లభిస్తుందని, పోలీస్ శాఖలో విశేష సేవలు అందించి ప్రతిష్టాత్మకమైన పోలీస్ సేవా పతకాలకు ఎంపికైన అధికారులను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అభినందించారు.

పోలీస్ సేవా పతకాలకు ఎంపికైన అధికారులు:

1.రాజేందర్, హెడ్ కానిస్టేబుల్ – ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ – ఉత్తమ సేవా పతకం. 2.నాగేశ్వరరావు, కమ్యూనికేషన్ ఎస్ఐ – సేవా పతకం 3.భూక్య లత, హెడ్ కానిస్టేబుల్ – ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ – సేవా పతకం. 4.శ్రీనివాస్, బోయినపల్లి పోలీస్ స్టేషన్ – సేవా పతకం.

# చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**– సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి: చందుర్తి సీఐ రవీందర్**

**– జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేసిన సీఐ రవీందర్**

**– దేశ సేవకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలి: చందుర్తి పోలీస్ స్టేషన్‌లో సీఐ పిలుపు**

చందుర్తి మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 15



ఎందరో మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణత్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని చందుర్తి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ (సీఐ) రవీందర్ పేర్కొన్నారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చందుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, దేశ సేవకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సబ్ ఇన్స్‌పెక్టర్ (ఎస్సై) జే. రమేష్‌తో పాటు స్టేషన్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాపయ్యపేటను ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం

**– ప్లాస్టిక్ ను తగ్గిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం**

ప్రజాదివాస్



చెన్నారావుపేట మండలం పాపయ్య పేటలో సెంటర్ ఫర్ పీపుల్ 'ఎస్ ఫారెస్ట్రీ (సిపిఫ్)బెటర్ కాటన్ ఇన్నిటిటివ్ (బీసీఐ) ముఖ్య కార్యక్రమాలు జెండా ఆవిష్కరణ జాతీయ సమైక్యత ప్లాస్టిక్ రహిత గ్రామం పాపయ్యపేట గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధర్శన్ గౌడ్ , ఉప సర్పంచ్ సారంగం, పంచాయతీ కార్యదర్శి రాజు, టీచర్ అనిత, సెంటర్ ఫర్ పీపుల్ ఫారెస్ట్రీ --బీసీఐ పుంపు ఉదయ్ కిరణ్, ఫీల్డ్ ఫెసిలిటేటర్స్ బృందం, శృతి, రమేష్ ప్రియాంక, తిరుపతి, గణేష్, రాజు, కుమారస్వామి, ఈర్య, సంతోష్, సందీప్, శివరాజు స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, రైతులు, మహిళా నాయకులు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఐక్యత, సమాజ భాగస్వామ్యం మరియు బాధ్యతాయుతమైన పౌరసత్వంపై అవగాహన కల్పించడం జరిగింది. ప్లాస్టిక్ రహిత గ్రామం కోసం అవగాహన కార్యక్రమం గ్రామ ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వీలైనంత వరకు పూర్తిగా నివారించడం మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం గురించి అవగాహన కల్పించారు. రైతులు మరియు గ్రామ ప్రజలను పర్యావరణహిత పద్ధతులను పాటించేలా ప్రోత్సహించారు. 100 స్టీల్ ప్లేట్ల పంపిణీ గ్రామ పంచాయతీకి 100 స్టీల్ ప్లేట్లు అందజేయడం జరిగింది. డిస్పోజబుల్ ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగాన్ని తగ్గించి, పునర్వినియోగించగల స్టీల్ ప్లేట్లను ఉపయోగించడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. పాపయ్యపేట గ్రామాన్ని పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన ప్లాస్టిక్ రహిత గ్రామంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రేరణ పొందిన గ్రామ ప్రజలు కూడా తమ వంతు సహకారాన్ని అందించేందుకు ముందుకు వస్తూ, స్టీల్ గ్లాసులు మరియు స్టీల్ ప్లేట్లు అందించి ప్లాస్టిక్ రహిత గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముందుకు వస్తున్నారు.

# బుధరావుపేట మున్నూరుకాపు సంఘంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రజాదివాస్

ఖానాపురం మండలం బుధరావుపేటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు శేరు మధు జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ జెండాకు వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులు పసునూరి సురేష్, వెంకటరామ నరసయ్య, పసునూరి నరసయ్య, పసునూరి వెంకటేశ్వర్లు, లింగిడి వెంకటేశ్వర్లు, జల్లి మధు, కార్యదర్శి మహాలక్ష్మి వెంకటేశ్వర్లు, పసునూరి వెంకన్న, శేరు శీను తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్నూరు కాపు మహిళా కమిటీ సభ్యులు వాసంశెట్టి విజయ, తెడ్డు రేణుకతో పాటు ఇతర సంఘాల అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ రాణి గోవర్ధన్, ఉప సర్పంచ్ సింగ్ సుధాకర్, వార్డు సభ్యులు, గ్రామ యువత, బుధరావుపేట జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి, జాతీయ గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. గ్రామ ప్రజలు, సంఘ నాయకులు, మహిళా కమిటీ సభ్యులు, యువత కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు శేరు మధు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాల సాధనకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఐక్యత, దేశభక్తి, సామాజిక సేవా భావాలను మరింత బలోపేతం చేసుకోవాలని కోరారు. స్వాతంత్ర్యం మన హక్కు మాత్రమే కాదు. మన బాధ్యత కూడా దేశ ఐక్యత, గ్రామ



అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు.

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక
16-08-2026

## స్వాతంత్ర దినోత్సవం వేడుకలో పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేసి...

ప్రజాదివాస్



వాంకిడి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాంకిడి, గ్రీన్ వుడ్ ఇంగ్లీష్ మీడియం మీడియం పాఠశాలల్లో నిర్వహించిన 80వ స్వాతంత్ర దినోత్సవం వేడుకలో విద్యుత్ శాఖ మాజీ ఎస్సీ సూపర్డెంట్ ఇంజనీర్ (హైదరాబాద్),కల్లూరి దిలీప్ కుమార్ గారు,పాల్గొన్నిగూరూ లో 700,గ్రీన్ వుడ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో 600 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు.నేటి బాల బాలికలే రేపటి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి ట్రస్ట్ చైర్మన్ గాదె అనిల్ కుమార్ , లక్ష్మణ సేవాసదన్ వెల్ఫేర్ సొసైటీ(చీ+హా) చైర్మన్ గాదె అవినాష్ .వైస్ చైర్మన్ ఐతీ. అశోక్ మహుల్కర్ , వాంకిడి మాజీ సర్పంచ్ బండే తుకారాం ,సర్పంచ్ చూనార్కర్ సతీష్ ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాంకిడి ప్రధాన్షోధ్యాయులు నటరాజ్ ,గ్రీన్ వుడ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వాంకిడి ప్రధానోపాధ్యాయులు చక్రపాణి,,ఉపాధ్యాయులు విద్యార్థులను పాల్గొన్నారు.

## వారం రోజుల్లో భారీ చోరీ కేసు ఛేదన నిందితుడు అరెస్ట్..

**-16 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు స్వాధీనం**

ప్రజాదివాస్

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఇంటిలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు వారం రోజుల్లోనే ఛేదించారు. చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 16 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు, మొబైల్ ఫోన్ తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కేసును ఛేదించినట్లు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ తెలిపారు. దేవునిపల్లి విద్యుత్ నగర్ కాలనీకి చెందిన మామిండ్ల లావణ్య, భర్త సురేష్ కుమార్ ఈ నెల 7న ఉదయం 8.30 గంటలకు ఇంటికి తాళం వేసి తన తల్లి ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపు గొళ్లెం పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా ఉండటంతో పాటు బీరువా తాళం కూడా పగులగొట్టి ఉంది. పరిశీలించగా సుమారు 16 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి వస్తువులు, నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ ఆధ్వర్యంలో కామారెడ్డి రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామన్, దేవునిపల్లి ఎస్ఐ రంజిత్, సీసీఎస్ ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను విస్తృతంగా పరిశీలించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అనుమానాస్పద వ్యక్తి కదలికలను గుర్తించారు. ఈ క్రమంలో శనివారం మధుర నగర్ ప్రాంతంలో దేవునిపల్లి పోలీసుల పెట్రోలింగ్ వాహనాన్ని చూసిన నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు వడ్ల శ్రీనివాస్ (40), దేవునిపల్లి, కామారెడ్డిగా గుర్తించారు. అప్పులు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీకి పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఈ నెల 7న తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించిన శ్రీనివాస్, అదే రోజు రాత్రి పాత ఇంటి వద్ద ఉన్న ఇనుప రాడ్ తీసుకుని, ఇంటి పక్కనున్న ఖాళీ స్థలం ద్వారా కాంపౌండ్ వాల్ ఎక్కి ఇంట్లోకి ప్రవేశించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బెడ్‌రూమ్‌లోని బీరువా తాళాన్ని ఇనుప రాడ్‌తో పగులగొట్టి బంగారు




ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.90 వేల నగదును అపహరించినట్లు విచారణలో వెల్లడైంది. స్వాధీనం చేసుకున్న వస్తువులు బంగారు నల్లపూసల త్రాడు 1 బంగారు చైన్లు 2 బంగారు ఉంగరాలు 7 కమ్మల బుట్టలు 1 జత కమ్మలు 3 జతలు గోల్డ్ బిస్కెట్లు 2 గోల్డ్ బిస్కెట్ చిన్న ముక్కలు 4 మొబైల్ ఫోన్ 1 నగదు రూ.50,000 వారం రోజుల్లోనే కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన బంగారు ఆభరణాలు, నగదు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామన్, దేవునిపల్లి ఎస్ఐ రంజిత్, సీసీఎస్ ఎస్ఐ మహేష్‌తో పాటు సిబ్బంది రాజేందర్, రవి, శ్రీనివాస్, లక్ష్మీకాంత్, దేవునిపల్లి సిబ్బంది రవికిరణ్, రవిలను అభినందించారు.

## ప్రెస్ క్లబ్ భవనంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ప్రజాదివాస్



ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ ఆవరణలో నవనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సుంకరి గంగా మోహన్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ పతాకానికి వందనం చేశారు.అనంతరం ఆర్మూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చౌల్ సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం 80 ఏళ్ల క్రితం మహనీయులు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామని పేర్కొన్నారు.బ్రిటిష్ వారి కబంధహస్తాల నుంచి దేశాన్ని విముక్తి చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నవనాథపురం ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు సాత్ పుతే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మ్యాకల దినేష్, చిన్న, రాజేందర్, చక్రి, సాయి ప్రణీత్, నరేందర్, షికారి శ్రీనివాస్, యయాపై, చరణ్ గౌడ్, వెంకటేశం, సుదర్శన్, (నమస్తే ఇందుర్ ) గటడి అరుణ్, క్రాంతి, శ్రావణ్, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 16వ వార్డులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..

ప్రజాదివాస్



కామారెడ్డి పట్టణంలోని 16వ వార్డులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు.దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యాడారం సంతోష్, విజయ్, నందు, రాహుల్, లక్ష్మీరాజ్యం, రాధాకిషన్, నీలేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, గంగారెడ్డి, శోభన్, అజయ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మంపేట హైస్కూల్ అభివృద్ధి కోసం దాతలు రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం







ప్రజాదివాస్

దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు అభివృద్ధి కోసం దాతలుగా ముందుకు వచ్చి ఆట వస్తువులు సహకరించి, విద్యార్థుల గదులలో కరెంటు మరియు ఫ్యాన్స్ సౌకర్యం కల్పిస్తూ రెండు లక్షల ఆర్థిక సహాయం అందించి.తన మిత్రులతో కూడా సుమారు రెండు లక్షల రూపాయల వరకు సహకారం అందించిన మన గ్రామ నివాసులు కోమండ్ల నీరజ - నిరంజన్ వారి తల్లిదండ్రులు స్వరూప - సూరారెడ్డి లు మరియు విద్యార్థుల నోటు పుస్తకాల కోసం ఆర్థిక సహాయం 40 వేల రూపాయలు అందించిన దొనపాటి విఘ్నేశ్వర్ రెడ్డి తన మిత్రులు.అలాగే నెలకు 5000 రూపాయల చొప్పున ప్రైవేట్ ఉపాధ్యాయుల వేతనం కోసం సంవత్సరానికి 60000 చెల్లిస్తున్న మన గ్రామానికి చెందిన బురగాని రాజు గ్రామంతో ఎలాంటి సంబంధం లేని బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ వారు విద్యార్థులకు 30 డేస్కులు (బల్లలు)మరియు సౌండ్ సెట్ ఒక్క లక్ష ఇరవై వేల రూపాయల విలువ చేసే వస్తువులు ఇప్పించిన వీరేశం, శ్రీనివాస్ లు ఈరోజు మన ప్రాథమిక పాఠశాలకు విచ్చేసి ఆట వస్తువులను గదులలో వేసిన బల్లలను ఓపెనింగ్ చేసిన సందర్భముగా వారిని పాఠశాల తరపున సన్మానించడం జరిగినది.ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ మోడెం శ్రీలత హాజరై మాట్లాడినారు.అలాగే గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు పాఠశాలకు విచ్చేసిన దాతలు సీసీ కోమన్ల స్వరూప - సూరారెడ్డిలు మరియు బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ బాధ్యులు వీరేశం శ్రీనివాస్ మాట్లాడటం జరిగినది.అలాగే దాతలను పాఠశాల తరఫున సన్మానించడం జరిగినది.అలాగే విద్యార్థులు పాటలు,డాన్సుల కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో హై స్కూల్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు భద్రయ్య రాజు,చంద్రమౌళి వెంకటేశ్వర్లు,అశోక్ ఉపాధ్యాయురాలు పద్మ, బోనగాని రమాదేవి, దునపాటి మానస, దండు గౌతమి పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ తరఫున మోడం మల్లేశం మాట్లాడుతూ.. మన గ్రామ పాఠశాల అభివృద్ధి కోసం సహకరించిన మన గ్రామ వాస్తవ్యులు,సామాజిక సేవకులు కోమండ్ల నీరజ - నిరంజన్ వారి మిత్ర బృందానికి, మరియు బురగాని రాజు,దొనపాటి విఘ్నేశ్వర్ రెడ్డి వారి మిత్ర బృందానికి, అలాగే బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ పెద్దలు వీరేశం శ్రీనివాస్ శిరస్సు వంచి అభినందనలు తెలపడం జరిగినది.అలాగే మన గ్రామంలోని వివిధ ప్రభుత్వ,ప్రైవేటు రంగాలలో పనిచేయుచున్న వారు మన పాఠశాల అభివృద్ధి కోసం సహాయ సహకారాలు,ఆర్థిక సహకారాలు అందించి మన ప్రభుత్వ పాఠశాలను ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రగతి పథంలో నడిపించుటకు చేదోడు వాదోడుగా మన గ్రామ ప్రజలతో సహా అందరూ ఉండాలని కోరడము జరిగినది. అలాగే ఈరోజు ఒకే విద్యార్థితో ఉన్న పాఠశాల లో 90 మంది విద్యార్థుల ను చేర్పించడం జరిగినది.ఇంతమంది విద్యార్థుల వద్దకు గ్రామ పెద్దల సహకారంతో ,ఉపాధ్యాయుల సహకారంతో,అక్కపెల్లి అశోక్ మీద ఉన్న నమ్మకంతో, విద్యార్థుల తల్లిదండ్రులకు మా మీద ఉన్న నమ్మకంతో పాఠశాలకు పంపిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులందరికి కూడా అభినందనలు తెలుపుతున్నాను.ప్రధానంగా మన ప్రభుత్వ పాఠశాలను వచ్చే సంవత్సరం వరకు 200 మందికి పైగా విద్యార్థుల ను చేర్పించి. ఒక నాణ్యమైన విద్యను విద్యార్థులు పొందుటకు మన గ్రామస్తులు,మిగతా చుట్టుపక్కల గ్రామాల వారు కూడా ముందుకు వచ్చి మన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి.ప్రైవేటు పాఠశాల కంటే మెరుగైన విద్యను పొందాలని, అటువైపుగా విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ ఆలోచించాలని,అలాగే మన ఊరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న అనేకమంది ప్రభుత్వ ఉద్యోగులుగా,ప్రైవేటు ఉద్యోగులుగా,వ్యాపారస్తులుగా ఇతర రంగాలలో స్థిరపడిన వారు అనేక మంది ఉన్నారు.వారందరూ కూడా దయతలచి మన ప్రభుత్వ పాఠశాలను ప్రగతి పథంలో నడిపించుటకు దాతలుగా ముందుకు వచ్చి,పాఠశాల అభివృద్ధికి సహకరించాలని, వారందరి సహకారం కోసం ఎల్లవేళలా ఎదురుచూస్తూ ఉంటామని మరొకసారి దాతలకు,గ్రామ ప్రజలకు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేయడం జరిగినది. కామ్రేడ్ మోడం శ్రీలత,గ్రామ సర్పంచ్ తిమ్మంపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు అభివృద్ధి కోసం దాతలుగా ముందుకు వచ్చి ఆట వస్తువులు సహకరించి విద్యార్థుల గదులలో కరెంటు మరియు ఫ్యాన్స్ సౌకర్యం కల్పిస్తూ రెండు లక్షల ఆర్థిక సహాయం అందించి తన మిత్రులతో కూడా సుమారు రెండు లక్షల రూపాయల వరకు సహకారం అందించిన మన గ్రామ నివాసులు కోమండ్ల నీరజ నిరంజన్ వారి తల్లిదండ్రులు స్వరూప సూరారెడ్డి లు విద్యార్థుల నోటు పుస్తకాల కోసం ఆర్థిక సహాయం 40 వేల రూపాయలు అందించిన, దొనపాట...

# చరిత్రలో కొన్ని పేజీలు దాటవేయకుండా చూస్తే!



కథానాయకుడు విజయ్ సేతుపతి.. దర్శకుడు బాలాజీ తరణీతరణ్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'బత్తా'. మురాద్ ఖేతాని, ప్రియా అట్లీ, అలోక్ జైన్, అజిత్ అంధారే నిర్మిస్తున్నారు. అట్లీ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రం అక్టోబరు 1న థియేటర్లలో విడుదల కానుంది. ఇటీవల ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. ఈ నేపథ్యంలో "కె-టౌన్ చరిత్రలో కొన్ని పేజీలు దాటవేయకుండా చూస్తే మా కాంబో మూడోసారి కలిసినప్పుడు అది ఒక బ్లాక్‌బస్టర్ అవుతుంది" అనే క్యాప్షన్‌ను జోడించింది. ఈ పోస్టర్‌లో విజయ్ రెట్రో లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నారు. విలక్షణ నటుడు విజయ్, దర్శకుడు బాలాజీ తరణీతరణ్ కాంబినేషన్‌లో రూపొందిన 'నడువుల కొంజం పక్కత్త కానోం', 'సీతకాతి' చిత్రాలతో సినీప్రియుల్ని అలరించారు. మరోసారి వీరిద్దరి కలయికలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్ ఎలాంటి పాత్రలో కనిపించనున్నాడో తెలియాలంటే సినిమా విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే.

# నా అనుభవమే వారికో హెచ్చరిక!

తెరపై ఆడిపాడుతూ.. ప్రేక్షకులకు వినోదాన్ని పంచే తారల జీవితాల వెనుక కూడా ఎన్నో సమస్యలు ఉంటాయి. ఈ క్రమంలోనే తనదైన నటనతో కుర్రకారుని ఉర్రూతలూగించే నాయిక అనుపమ పరమేశ్వరన్ గత రెండేళ్లుగా నరకం అనుభవించానని, ప్రతి రాత్రి ఏడ్చేదాన్నని అంటోంది. ఈమధ్యే ఆమె 'మనశ్శాంతి దక్కాలంటే కొన్ని డెడ్‌ఎండ్స్ దాటి ముందుకు వెళ్లాలి' అంటూ పోస్ట్ పెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ.. ఆ పోస్ట్ వెనుక అసలు నిజాన్ని పంచుకుంది. "ఆ పోస్ట్ ఏదో రాత్రికి రాత్రి పెట్టింది కాదు. దాని వెనుక రెండేళ్ల బాధ ఉంది. నేను పూర్తిగా కోలుకొని ధైర్యంగా నిలబడే స్థాయికి వచ్చిన తర్వాతే ఆ విషయాన్ని ప్రపంచంతో పంచుకున్నాను. తన గురించి, తన జీవితం గురించి ఓ గొప్ప విషయాన్ని గుర్తించి.. కోలుకోవడానికి, ఒక ముఖ్యమైన విషయాన్ని వ్యక్తపరచడానికి సమయం తీసుకున్న ఒక అమ్మాయి ప్రయాణం ఇది. నేను రెండేళ్ల పాటు నార్సిసిస్టిక్ అబ్యూజ్ (మానసిక వేధింపుల)ను ఎదుర్కొన్నాను. ఇన్‌స్టాలో నటి మడోన్నా దీని గురించి మాట్లాడిన ఓ వీడియో చూసినప్పుడు నా శరీరం భయంతో వణికిపోయింది. ఒక రిలేషన్‌షిప్‌లోకి వెళ్లాక అందంగా వికసించాల్సిన నేను.. రోజురోజుకూ బరువు తగ్గి కుంగిపోయాను. ప్రతి రాత్రి ఏడ్చేదాన్ని. నా పరిస్థితిని చూసి కొందరు నెగిటివ్ కామెంట్స్ చేశారు. మరికొందరు అర్థం చేసుకున్నారు. కానీ అసలు ఈ వేధింపులను గుర్తించలేని మూడో కేటగిరీ వ్యక్తుల కోసమే నేను నోరు విప్పుతున్నాను. చాలా కాలం తర్వాత ఈ మానసిక గాయం నుంచి కోలుకున్నా. ఇటువంటి విషపూరితమైన బంధాలలో చిక్కుకున్న వారికి నా అనుభవం ఒక హెచ్చరికగా నిలవాలనే ఉద్దేశ్యంతోనే ఈ విషయాల గురించి బహిరంగంగా మాట్లాడుతున్నా" అని చెప్పుకొచ్చింది అనుపమ.



# శర్వానంద్ – శ్రీను వైట్ల సినిమా షురూ...




హీరో శర్వానంద్, ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రానుంది. ఈ సినిమా నేడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ క్లాప్ కొట్టగా.. ప్రముఖ నిర్మాత సురేశ్ బాబు కెమెరా స్విచ్ చేశారు. ఇక ఈ చిత్రానికి 'జార్జ్ క్రిష్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర, అజయ్ సుంకర నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న దీన్ని విడుదల చేయనున్నట్లు టీమ్ పేర్కొంది.ప్రస్తుతం శర్వానంద్ 'భోగి'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. సంపత్ నంది దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఆగస్టు 28న విడుదల కానుంది. ఉత్తర తెలంగాణ – మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ కథని పాన్ ఇండియా స్థాయిలో తెర పైకి తీసుకొస్తున్నారు. శర్వాకు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి నటిస్తున్నారు. 'కందుల సులోచన రాణి'గా అనుపమ కనిపించనుండగా.. మందారం అనే బోల్డ్ పాత్రలో డింపుల్ నటిస్తున్నారు.

# అందుకే వారానికోసారి పాస్‌వర్డ్ మారుస్తా: నాగార్జున



సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ సైబర్ పోలీసులు దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్నారని అగ్ర కథానాయకుడు నాగార్జున ప్రశంసించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో జరిగిన 'సురక్ష కా తిరంగా' సైబర్ అవగాహన కార్యక్రమానికి డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గతంలో తనకు ఎదురైన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. ఐదేళ్ల క్రితం తనను ఓ వ్యక్తి మోసం చేసేందుకు ప్రయత్నించినట్లు చెప్పారు.1977లో తాను ఇంజనీరింగ్ చదువుతున్న రోజుల్లోనే కంప్యూటర్లు అందుబాటులోకి వచ్చాయని, అప్పట్లో మాల్‌వేర్ హ్యాకింగ్‌పై ప్రొఫెసర్లు తీవ్రంగా హెచ్చరించేవారని ఆయన గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు సైబర్ నేరాల సమస్య కొనసాగుతూనే ఉందన్నారు. తాను కూడా సైబర్ నేరాల బాధితుడినేనని నాగార్జున చెప్పారు. "ఐదేళ్ల క్రితం ఓ వ్యక్తి బ్యాంక్ అధికారిగా నటిస్తూ, పెట్టుబడుల పేరుతో నన్ను మోసం చేసేందుకు ప్రయత్నించాడు. అంతేకాకుండా విదేశాలకు మాదకద్రవ్యాల పార్సిల్ పంపారంటూ నేరగాళ్లు బెదిరింపు ఫోన్ కాల్స్ కూడా చేశారు. చివరకు నా కుటుంబంలోని కొందరిని మాయమాటలతో భయపెట్టి 6 నుంచి 7 గంటల పాటు డిజిటల్ అరెస్ట్ చేశారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ భద్రతా నియమాలు పాటించాలని నాగార్జున సూచించారు. "సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండటం, వాటిని అరికట్టడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత. నేనైతే ముందు జాగ్రత్తగా వారానికి ఒకసారి మొబైల్ పాస్‌వర్డ్, నెలకు ఒకసారి వైఫై పాస్‌వర్డ్ మారుస్తాను. నా మొబైల్‌లో కనీసం ఫోటోలు కూడా స్టోర్ చేయను" అని వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ పోలీసుల చర్యలను నాగార్జున అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు ఇతర దేశాలకు వెళ్లి మరీ అరెస్టులు చేసిన ఘనత తెలంగాణ పోలీసులకే దక్కుతుందన్నారు. అలాగే తెలుగు సినీ రంగంలో పైరసీని అరికట్టడంలో ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, సజ్జనార్ ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. పైరసీ నియంత్రణలో తెలంగాణ పోలీసులు తీసుకున్న కఠిన చర్యల వల్ల కేవలం తెలుగు చిత్ర పరిశ్రమకే కాకుండా, మొత్తం భారతీయ సినీ పరిశ్రమకు ఎంతో మేలు జరిగిందన్నారు.

# 'టాక్సిక్'.. కియారాకు బాడీగార్డ్‌లా ఉన్నా: యశ్





సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' .. మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారాపై మరోసారి ప్రశంసలు కురిపించారు."కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుంది" అని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ప్రజలు కచ్చితంగా కియారను అభినందిస్తారని. ఆ నమ్మకం తనకు ఉందన్నారు.అది వారి లోపంగా భావిస్తా..: 'టాక్సిక్' విమర్శలపై యశ్ కామెంట్స్ ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అద్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# ధర్మన్ జోరు



భారతీయ చిత్ర పరిశ్రమని ఎంతగానో ప్రభావితం చేసే అగ్ర కథానాయకులు రజనీకాంత్ – కమల్‌హాసన్. వృత్తిపరంగా సమకాలికులైన ఈ ఇద్దరూ...నిజ జీవితంలో మంచి స్నేహితులు. ఈ ఇద్దరూ కలిసి పలు చిత్రాల్లో మెరిశారు. ఇప్పుడు తొలిసారి ఒకరు నిర్మాతగా, మరొకరు నటుడిగా ఓ సినిమా చేస్తున్నారు. అదే.. 'ధర్మన్'. ది డెడ్లీ డాక్టర్... అనేది ఉపశీర్షిక. రజనీకాంత్ హీరోగా నటిస్తుండగా, రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకుడు. సిమ్రన్, రాశీఖన్నా కథానాయికలు. ఇటీవల సినిమా రెండో షెడ్యూల్ చిత్రీకరణని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్రబృందం ఓ ప్రత్యేకమైన ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. అది సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఇందులో రజనీకాంత్ వైద్యుడిగా తనదైన స్టైల్, మేనరిజమ్‌తో సందడి చేయనున్నారు.